క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన


వేతనదారుల మస్తర్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్

మెరకముడిదాం: రాచగుమడాం గ్రామంలోని పువ్వలగుండం చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనుఉల చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందుతుందన్నారు.రోజూ రెండుపూటలా పనులకు హాజరు కావాలని చెప్పారు. పనిప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. మస్తర్లలో దిద్దుబాట్లు లేకుండా చూసుకోవాలన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సురేష్


చీపురుపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఐ.సురేష్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సమావేశంలో ఎలాంటి చర్చలు చేయకూడదని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం, సమస్యలపై ఎలాంటి చర్చలు జరపడం లేదని సభ్యులకు సూచించారు. జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైస్ ఎంపీపీ కరిమజ్జి వెంకటరమణమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

లెప్రా సొసైటీకి ఆర్థిక సహాయం


లెప్రా సొసైటీ ఎగ్జిక్యూటివ్‌కు నగదు అందజేస్తున్న హెచ్‌ఎం, విద్యార్థులు

చీపురుపల్లి: లెప్రసీ, అంగవైకల్యంతో బాధపడుతున్న వారికి లెప్రా సొసైటీ ద్వారా వైద్య సేవలందించేందుకు మండలంలోని మెట్టపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.17,068 ఆర్థిక సహాయం చేశారు. బుధవారం ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం తేజశ్విని, విద్యార్థులు కలిసి నగదును లెప్రా సొసైటీ ఎగ్జిక్యూటివ్ లెంక రమణకు అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ లెప్రసీ, అంగవైకల్యంతో బాధపడుతున్న వారికి లెప్రా సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలను విద్యార్థులకు వివరించామన్నారు. విద్యార్థులు ఎంతో పెద్ద మనస్సుతో డబ్బులు పోగు చేసి ఇవ్వడం గొప్ప విషయమన్నారు.

ఎన్నికల ప్రచారం


కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తవలస/వేపాడ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న కె.విజయగౌరికి మద్దతుగా యూటీఎఫ్ నాయకులు కొత్తవలస,వేపాడ మండలాల్లో బుధవారం ప్రచారం చేశారు. కొత్తవలస, ఎల్.కోట, వేపాడ మండలా ల్లోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు వెళ్లి విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులను కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.వెంకటరావు, నాయకులు బంగారు నాయుడు, ఎం.వి. సూర్యనారాయణ, జి.వి.రమణ ,రావాడ రామసత్యం, జగదీశ్వరరావు, ప్రసాద్,నాయుడు, చెల్లంనాయుడు, జి.వెంకట నాయుడు, సీహెచ్.నిర్మలాదేవి, వి.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

గజపతినగరం: స్థానిక టౌన్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఈనెల 21న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని బొబ్బిలి డివిజన్ విద్యుత్ శాఖ కార్యనిర్వాహక అధికారి ఏ.అనంతరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గజపతినగరం టౌన్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్లకొమ్మలు తొలగింపు పనులు చేపడతామని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గజపతినగరం, ఎం.వెంకటాపురం , బూడిపేట, దావాలపేట, పురిటిపెంట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏరులై పారుతున్న మద్యం..!

- ఊరూరా విచ్చలవిడిగా బెల్టు షాపులు
- వాటికి నేరుగా లైసెన్స్‌డ్ దుకాణాల సిబ్బందే మద్యం సరఫరా...!
- లైసెన్స్‌డ్ దుకాణాల వద్దే మందుతాగే వెసులుబాటు
- నాలుగు నెలల్లో రూ.44 కోట్ల మద్యం విక్రయాలు

గజపతినగరం రూరల్:

పేదల సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం మద్యం విక్రయాల్లో మాత్రం జోరు ప్రదర్శిస్తోంది. గ్రామాల్లో విచ్చలవిడిగా వెలసిన బెల్టు షాపుల ద్వారా మద్యం ఏరులై పారు తోంది. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజపతినగరం నియోజకవర్గం లో మద్యం అమ్మ కాలు

గజపతినగరం సర్కిల్ పరిధిలో లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలు	
మండలం	షాపులు
గజపతినగరం	4
మెంటాడ	3
దత్తిరాజేరు	4
బొండపల్లి	4

2024 అక్టోబర్ 16 నుంచి 2025 ఫిబ్రవరి 15 వరకు జరిగిన మద్యం విక్రయాలు	
లిక్కర్	67,602 కేసులు
బీర్లు	17,353 కేసులు
మొత్తం నగదు	రూ.44కోట్లు


గజపతినగరంలోని లైసెన్స్‌డ్ మద్యంషాపు



రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయి. గజపతినగరం సర్కిల్ పరిధిలో ని గజపతినగరం,దత్తిరాజేరు,బొండపల్లి, మెంటాడ మండలా ల్లో మొత్తం 15 లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల నిర్వహణకు ప్రభు త్వం అనుమతులు ఇచ్చింది. అయితే ఈ లైసెన్స్‌డ్ దుకాణాలు ప్రారంభమైన వెంటనే సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లోనూ బెల్టు షాపులు వెలశాయి. కొన్ని గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణకు లక్షల రూ పాయల్లో వేలం పాటలు జరిగాయని సమాచారం. లైసెన్స్‌డ్ దుకాణాలకు వచ్చిన స్టాక్ వచ్చి నట్లే అయి పోతోంది. ఆ దుకాణాల వద్దే మందుబాబులు దర్జాగా మద్యం తాగుతున్నారు. మద్యం దుకాణాల వద్ద అధికారికంగా పర్మిట్ రూమ్‌లు లేకపోయినా వాటి పక్కనే బయట వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న చిరుతిండి దుకాణాలు సిట్టింగ్ రూమ్‌లు మాదిరిగా మందుబాబులకు ఉపయోగపడుతున్నాయి.


మెంటాడ మండలంలో లైసెన్స్‌డ్ షాపు వద్దే తాగుతున్న మందుబాబులు

కట్టడి చేస్తున్నాం...

మద్యం అక్రమ వ్యాపారాన్ని పూర్తిగా కట్టడి చేస్తున్నాం. గ్రామాల్లో ఎవరూ బెల్టు షాపులు నిర్వహించకుండా నిఘా పెట్టాం. మద్యం అక్రమరవాణా జరగకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందితే వెంటనే దాడులు చేసి బెల్టు షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నాం. పూర్తిగా బెల్టు షాపులు లేకుండా చూస్తాం.

– జె.జనార్దనరావు, ఎక్సైజ్ సీఐ, గజపతినగరం

బెల్టు షాపులకు డోర్ డెలివరీ..!

వ్యాపారం పెంచుకునేందుకు లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల నిర్వాహకులు నిబంధనలకు పాతరేస్తున్నారు. గ్రామాల్లోని బెల్టు దుకాణాలను ప్రోత్సహిస్తున్నారు. బెల్టు షాపులకు లైసెన్స్‌డ్ దుకాణాల సిబ్బందే స్వయంగా మద్యం డోర్ డెలివరీ చేస్తుందనే చర్చ గ్రామాల్లో జరుగుతోంది.ఒక వ్యక్తికి మూడు సీసాలకంటే ఎక్కువ అమ్మకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా ఎవరు ఎంత అడిగితే అంత మద్యాన్ని కాదనకుండా ఇచ్చేస్తున్నారు.గోనె సంచుల్లో, అట్టపెట్టెల్లో ప్యాకింగ్ చేసి పరిమితికి మించి మద్యాన్ని దుకాణాల సిబ్బందే బెల్టు షాపులు నిర్వాహకులకు అమ్ముతున్న సందర్భాలు నిత్యకృత్యమయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. బెల్టుషాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడే చెప్పినప్పటికీ గ్రామాల్లో మాత్రం బెల్టు షాపులు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. ఎక్సైజ్ శాఖ అధికారులు తూతూమంత్రంగా దాడులు చేస్తూ మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఒకరిద్దరిని పట్టుకుని కేసులు నమోదుచేసి తమ పని ఇంతటి సరే అన్నట్లు వ్యవహరిస్తున్నారే తప్ప బెల్టు షాపులకు మద్యాన్ని అమ్ము తున్న లైసెన్స్‌డ్ దుకాణాల యజమానులపై కనీస చర్యలు తీసుకోవడం లేదని అంతటా చర్చించుకుంటున్నారు. బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్న దుకాణాలకు లైసెన్స్‌లు ఎందుకు రద్దు చేయడం లేదని ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. గజపతినగరం సర్కిల్ పరిధిలో 2024 అక్టోబర్ నుంచి 2025 ఫిబ్రవరి 15వ తేదీవరకు రూ.44కోట్లు మద్యం విక్రయాలు జరిగాయి. అక్టోబర్ నెల నుంచి ఫిబ్రవరి 16 వరకు ఎక్సైజ్ పోలీసులు 55 మంది బెల్టు షాపు నిర్వాహకులపై కేసులు నమోదుచేసి 123.32 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు.వీరిలో 47 మందిని గజపతినగరం తహసీల్దార్ వద్ద హాజరుపర్చి బైండోవర్ కేసులు నమోదు చేశారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి


గుర్ల హైస్కూల్‌లో మాట్లాడుతున్న సమగ్రశిక్ష అడిషనల్ కో-ఆర్డినేటర్ రామారావు

గుర్ల: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను సమాయ త్తం చేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ కో- ఆర్డినేటర్ ఏ.రామారావు అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని(కేజీబీవీ) బుధవారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ పరీక్షలకు తక్కువ సమయమే ఉన్నందున సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదుకోవాలని, ఒత్తిడికి గురికాకుండా ప్రశాం తంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షల్లో ప్రతీ ప్రశ్నకు జవాబు రాసేలా,సులభంగా మార్కులు సాధించే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కేజీబీవీలో మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓలు ఎస్.భానుప్రకాష్‌రావు, ఎం. శ్రీనివాసరావు, ఎస్ఓ జానకి ఉన్నారు.

కర్లాంలో 24 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు


కర్లాంలోని ఉమామల్లికార్జునస్వామి ఆలయం

చీపురుపల్లి: కర్లాం గ్రామంలో ఉమామల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో మహాశివరాత్రి 128వ యాత్ర నిర్వహణకు సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ బాణాన రామరత్నం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని 24, 25, 26వ తేదీల్లో ప్రతీ ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. 26న తెల్లవారు జామున 3 గంటల నుంచి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, రాత్రి 8గంటలకు ఉమామల్లికార్జునస్వామి కల్యాణం, అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ మహోత్సవం ఉంటాయని సర్పంచ్ భాగ్యలక్ష్మి బుధవారం తెలిపారు. అలాగే ఈనెల 24న కోలాటం, రేలా రే రేలా, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, 25న సీతారామ కల్యాణం బుర్రకథ, 26న మెగా డ్యాన్స్ ఢీ షో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. కర్లాం పంచాయతీలోని మోదుగులపేట, కర్లాం, చింతలపేట గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో ఉత్సవాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి


శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ కేశవరావు, అధ్యాపకులు, విద్యార్థులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్రశాఖ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కేశవరావు, అధ్యాపకులు, విద్యార్థులు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ భరతమాత ముద్దుబిడ్డ, యుద్ధ వీరుడు, హైంధవజాతి సంరక్షకుడని అన్నారు.చరిత్ర ఉపన్యాసకులు చల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ శివాజీ బిహార్, బెంగాల్ పాలకులను జయించి, హిందూ ధర్మ మహారాష్ట్రను ఏర్పాటు చేశారన్నారు. 1674లో ఛత్రపతి బిరుదు పొంది, స్వతంత్ర్య మరాఠాసామ్రాజ్యాన్ని స్థాపించారన్నారు. స్త్రీలను గౌరవించడంలో,వారికి సముచిత స్థానం కల్పించడంలో, ధర్మం, న్యాయం అందివ్వడంలో తనకు తానే సాటి అన్న రీతిగా చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ పాలన అందించిన శివాజీ చిరస్మరణీయుడని అన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదు

- పుణ్యగిరి జాతరపై సమీక్షలో తహసీల్దార్ అరుణకుమారి


అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ అరుణకుమారి

శృంగవరపుకోట: శివరాత్రి నేపథ్యంలో ఈనెల 26, 27వ తేదీల్లో నిర్వహించనున్న పుణ్యగిరి జాతరకు వచ్చే భక్తుల కు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకో వాలని తహసీల్దార్ అరుణకుమారి అధికారులను కోరారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో పుణ్యగిరి జాతరపై బుధవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల వల్ల స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానాన్ని పార్కింగ్‌కు ఇవ్వలేమని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని ఎస్ఐ గంగరాజును కోరారు. భర్తాపురం వరకు ఆర్టీసీ బస్సులు వెళ్లేలా ఏర్పాటు చేయాల ని ఆర్టీసీ డీఎం రమేష్‌కు సూచించారు. శివరాత్రికి ముందురోజు, మర్నాడు వరుసగా మూడు రోజుల పాటు ఎస్.కోట పట్టణానికి తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఝాన్సీకి చెప్పారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాలని, తాత్కాలిక మరుగుదొడ్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, రోడ్లపై దుమ్ము లేవకుండా,దుకాణాల ఏర్పాటుతో రోడ్ల ఆక్రమణలకు అవకాశం లేకుండా చూడాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సన్యాసయ్యపాలెం, పుణ్యగిరి ధారగంగమ్మ లోయల వద్ద అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్‌కు సూచించారు. శివరాత్రి రోజున జాగరణ చేసి మర్నాడు 27న భక్తులు అధిక సంఖ్యలో పుణ్యగిరికి దర్శనానికి వస్తారని, అయితే అదే రోజున ఎమ్మెల్సీ ఎన్నికలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం కేటాయించామని, 144సెక్షన్ అమలు వల్ల భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. 108 వాహనాన్ని సిద్ధం చేయాల్సిందిగా అధికారులను కోరామన్నారు. పుణ్యగిరి, సన్యాసయ్యపాలెం దేవాలయాలవద్ద బారికేడ్లు, టెంట్లు, చలివేంద్రాలు, మరుగుదొడ్లు, ప్రసాదాల విక్రయ కేంద్రాలు, దర్శనాల క్యూ లైన్లు వంటి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దేవాలయాల వద్ద, ఆర్టీసీ స్టాండ్ల వద్ద పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేయాలని పుణ్యగిరి దేవస్థానం ఈఓ నాగేంద్ర, సన్యాసయ్యపాలెం దేవస్థానం ఈఓ ప్రసాద్‌కు చెప్పారు.

23న రక్తదాన శిబిరం

గజపతినగరం: మండల కేంద్రంలో ఈనెల 23వ తేదీన సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆఫౌండే షన్ కార్యదర్శి రేవంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెంటాడ జంక్షన్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, రక్తదానం ప్రాణదానంతో సమానమని యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

భూ ఆధార్ తప్పనిసరి

గజపతినగరం రూరల్: అర్హులైన రైతులందరూ తప్పనిసరిగా భూ ఆధార్ చేయించుకోవాలని వ్యవసాయశాఖ సబ్ డివిజన్ ఏడీఏ కె. మహరాజన్ సూచించారు. మండలంలోని కొత్త శ్రీరంగరాజపురంలో నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సొంత భూమి ఉన్న రైతులందరూ రైతుసేవా కేంద్రాలకు వెళ్లి విశిష్ట సంఖ్య పొందాలన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సీహెచ్ ధనలక్ష్మి, ఉద్యావనశాఖ అధికారి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాస విత్తనాలు

వేపాడ: పాడి రైతులకు 75శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు అందిస్తున్నామని పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ బి.చలపతి రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్.కోట సబ్ డివిజన్ పరిధిలో రైతులకు పంపి ణీ చేసేందుకు 3.5టన్నుల విత్తనా లు సిద్ధం చేశామని పేర్కొన్నారు. అయిదు కిలోల విత్తనాల ప్యాకెట్‌ను రాయితీ పోగా రూ.115కు అందిస్తున్నామని, అయిదు కిలోల విత్తనాలతో 20 సెంట్ల విస్తీర్ణంలో గడ్డిసాగు చేసుకోవచ్చని వివరించారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమకు సమీపంలోని పశువైద్య కేంద్రంలో కానీ, రైతు సేవాకేంద్రాల్లో కానీ సంప్రదించాలని సూచించారు.

పల్లెవెలుగు సర్వీస్‌ను పునరుద్ధరించాలి

బొండపల్లి: ఎస్.కోట ఆర్టీసీ డిపో నుంచి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పూట నడిచే గజపతినగరం - ఎస్.కోట పల్లె వెలుగు బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని నాలుగు మండలాలకు చెందిన ప్రయాణికులు కోరుతున్నారు. రెండు సంవత్సరాల నుంచి సర్వీస్ నిలిపివేయడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు, నాలుగు మండలాల్లోని 15 గ్రామాలకు చెందిన ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లెవెలుగు సర్వీస్‌ను పనురుద్ధరించాలని కోరుతున్నారు.

కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని వినతి


ఎమ్మెల్యే లలితకుమారికి వినతిపత్రం అందజేస్తున్న విద్యాకమిటీ సభ్యులు

లక్కవరపుకోట: జమ్మాదేవిపేట సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల ఆశ్రమ పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ఆ పాఠశాల విద్యాకమిటీ సభ్యులు కోరారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని మండల కేంద్రంలో ఆమె నివాసంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా విద్యాకమిటీ సభ్యులు మాట్లాడుతూ 2019లో పాఠశాలను ప్రారంభించారని, ఇక్కడ ఎంతోమంది బాలికలు చదువుకుంటున్నారని చెప్పారు. పాఠశాల సాధిస్తున్న ఫలితాలను పరిగణనలోకి తీసుకుని రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.ఎమ్మెల్యే స్పందిస్తూ వెనుకబడిన తరగతుల బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆటపాటలతో విద్యను అందించాలి


కొత్తవలస: సూచనలు చేస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు


గజపతినగరం:శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీఓ నాగమణి, ఎంఈఓలు


మెరకముడిదాం: శిక్షణను పరిశీలిస్తున్న ఎంఈఓలు చంద్రశేఖర్, ధర్మశ్రీను

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని కొత్తవలస, వేపాడ,మెరకముడిదాం, గజపతిన గరం ఎంఈఓలు అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఆయా మండల కేంద్రాల్లోని ఉన్నత పాఠశాలల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండోరోజు బుధవారం 'జ్ఞాన జ్యోతి' శిక్షణ కార్యక్రమం కొనసాగింది.పౌష్టికాహారం, ప్రీస్కూల్ నిర్వహణ, యాక్టివేషన్లు, పీపీ-1, పీపీ-2 విద్యా బోధనపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.గజపతినగరంలో నిర్వహించిన శిక్షణ తరగతులను ఐసీడీఎస్ పీఓ పి.నాగమణి పరిశీలించారు. కొత్తవలస, వేపాడ,మెరకముడిదాం,గజపతినగరం ఎంఈఓలు జి.శ్రీదేవి, బి.శ్రీనివాసరావు, బాలభాస్కరరావు చంద్రశేఖర్, ధర్మశ్రీను, విమలమ్మ, సాయిచక్రధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

– కొత్తవలస/వేపాడ/మెరకముడిదాం/గజపతినగరం


వేపాడ: మాట్లాడుతున్న ఎంఈఓ బాలభాస్కరరావు

పొంచి ఉన్న ప్రమాదం



ఎస్.కోట పట్టణంలోని శ్రీనివాసకాలనీలో ఎరుకులపేట రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభానికి అమర్చిన ఫ్యూజ్ బాక్స్ ప్రమాదకరంగా ఉంది. పిల్లలకు సైతం చేతికి అందే ఎత్తులో, డోర్లు లేకుండా ఉంది. ఏమరపాటున, తెలిసీ తెలియక ఎవ్వరైనా చేయి వేస్తే ప్రాణాల్లో గాల్లో కలిసిపోవాల్సిందే. తక్షణమే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– శృంగవరపుకోట

ఒత్తిడిని జయించు..విజయం సాధించు


మాట్లాడుతున్న ఆరోగ్య కౌన్సెలర్ సంధ్య

వేపాడ: పరీక్షల సమయంలో సాధారణంగా విద్యార్థులు ఒత్తిడికి గురవుతుంటారని, ఒత్తిడిని అధిగమించి ప్రశాంతంగా పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఆరోగ్య కౌన్సెలర్ బి.సంధ్య అన్నారు. బక్కునాయుడుపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు కెరియర్, పరీక్షల్లో ఒత్తిడి అధిగమించడం, మానసిక, వ్యక్తిగత సమస్యలతో చదువుపై దృష్టిపెట్టలేక పోవడం తదితర అంశాలపై కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు నిరం తరం శ్రమించాలని చెప్పారు. పట్టుదలతో చదవడంతో పాటు ఒత్తిడిని జయిస్తేనే విజయం వరిస్తుందని అన్నారు. పెద్దలతో మర్యాదగా నడుచుకోవాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు